సాక్షి
పల్నాడు

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



గంగాభవానీకి కాసు పూజలు

మాచవరం: కొత్తగణేశునిపాడులో నూతనంగా నిర్మించిన శ్రీగంగాభవానీ అమ్మవారి దేవాలయాన్ని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం సందర్శించి, పూజలు చేశారు.



వైభవంగా పునఃప్రతిష్ట

క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో దేవతామూర్తుల పునఃప్రతిష్టను ఆదివారం వైభోపేతంగా నిర్వహించారు. నంబూరు శంకరరావు పూజలు చేశారు.

అమ్మవారికి వెండి చీర, జాకెట్ బహూకరణ



తెనాలి: అమృతలూరు మండలం కూచిపూడిలో గల శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి రజిత పీఠ సహిత చీర, జాకెట్‌ను తెనాలికి చెందిన విశ్రాంత ఉద్యోగి దాసరి వెంకటరావు, కథా రచయిత్రి దాసరి శివకుమారి దంపతులు బహూకరించారు.

న్యూస్‌రీల్

నేడు నామినేషన్లు ఇలా..

మాచర్లలో పీఆర్కే



మాచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్డ్డిలు హాజరు కానున్నారు. సోమవారం ఉదయం 9గంటలకు పట్టణంలోని రింగురోడ్డులో ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ భారీ సభ నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే వేలాది మంది పీఆర్కే నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సొంతంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వినుకొండలో బొల్లా...



వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ వినుకొండ అసెంబ్లీ అభ్యర్థిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం నామినేషన్ వేయనున్నట్లు పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9.30గంటలకు పట్టణంలోని బొల్లా బ్రహ్మనాయుడు కల్యాణ మండపం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి బస్టాండ్, శివయ్యస్థూపం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి నామినేషన్ వేయనున్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని నామినేషన్ కార్యక్రమ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

పెదకూరపాడులో నంబూరు..



పెదకూరపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థి నంబూరు శంకరరావు సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అమరావతి మండలం 14వ మైలు నుంచి అమరావతి, 75త్యాళ్లూరు మీదగా పెదకూరపాడు వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం పెదకూరపాడులోని నాలుగు రోడ్ల సెంటర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పెదకూరపాడులోని ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు పార్టీ జిల్లా నేతలు పాల్గొనున్నారు.

జిల్లాకు చెందిన పలువురికి వైఎస్సార్ సీపీలో స్థానం

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని వివిధ హోదాల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా పచ్చల ఆనందరావు, కాకుమాను సదాశివరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శ్యామల రవికిషోర్‌రెడ్డి నియమితులయ్యారు. స్టేట్ క్రిస్టియన్ మైనార్టీసెల్ కమి టీ ప్రధానకార్యదర్శిగా గంజుకుంట జయప్రకాష్, స్టేట్ మైనార్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఏవీఎం సుభాని, కార్యదర్శిగా షేక్ అలీమయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ కమిటీ ప్రధా న కార్యదర్శిగా బుల్లెద్దు చిన్న నియమితులయ్యారు.

11 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్ని పురస్కరించుకొని ఈ నెల 15న పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. దీనికి గైర్హాజరైన 11 మందికి షోకాజ్ నోటీసుల్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి జారీ చేశారు. 48 గంటల్లో సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సమాధానం సంతృప్తికరంగా లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 507.20 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.

వలసలకు అడ్డుకట్ట

ఉన్న ఊళ్లోనే ఉపాధి...కూలీల మోముల్లో కాంతులు

- ఐదేళ్లలో కల్పించిన పనిదినాలు 3.56 కోట్లు
- చెల్లించిన వేతనాలు రూ.759.23 కోట్లు
- మెటీరియల్ నిమిత్తం ఖర్చుచేసింది రూ.603.33 కోట్లు
- ఒక్కో కుటుంబానికి రూ.13,500 లబ్ధి
- జిల్లాలో జాబ్‌కార్డులు 3.15 లక్షలు
- వేతనదారులు 5.42 లక్షల మంది
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై సర్వత్రా హర్షం

వలసల నివారణే ధ్యేయంగా ప్రభుత్వ అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ఇటు కూలీలకు, అటు పల్లెల ప్రగతికి ఎంతో దోహదపడుతుంది. పథకం కింద వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో కూలీలకు ఆర్థిక భరోసా ఏర్పడి వారిలో కొనుగోలు సామర్థ్యం పెరిగింది. ఉన్న ఊళ్లోని ఉపాధి దొరుకుతుండడంతో కూలీలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

యడ్లపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న పనులు గ్రామీణ కూలీల బతుకుల్లో వెలుగులు నింపుతున్నాయి. పేదలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించే విషయంలో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. గతంలో ఉపాధి లేక గ్రామాల్లో కూలీలు ఇతర ప్రాంతాలలో వలస వెళ్లేవారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం స్థానికంగానే వారికి పని కల్పిస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు పనులు లేక వలస పోయే పరిస్థితి లేకుండా ఉండాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం. పథకం కింద అడిగిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఉపాధి చూపుతూ, సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించి పారదర్శకంగా పథకం అమలు చేస్తోంది. చేసిన పనికి తగిన వేతనం సకాలంలోనే అందిస్తుంది. దీంతో వేతనదారులు ఉన్న ఊరిలోనే పనులు చేసుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా ఈ పథకం ఇప్పుడు అన్ని రంగాలకు అనుసంధానం చేయడం, అందుకు అనుకూలంగా ఉపాధి హామీ పథకం ద్వారా రోజు ప్రతి జిల్లాలో లక్షల మందికి పనులు చూపడంతో కుటుంబంలో ప్రతి ఒక్కరికి పథకం అక్కరకు వస్తుంది. వ్యక్తిగత లబ్ధితోపాటు సమాజ శ్రేయస్సుకు ఊతమిస్తోంది. పథకం కింద వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో కూలీలకు ఆర్థిక భరోసా ఏర్పడి వారిలో కొనుగోలు



వంకాయలపాడులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

సామర్థ్యం పెరిగింది. వలసల నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వ అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ఇటు కూలీలకు, అటు పల్లెల ప్రగతికి ఎంతో దోహదపడుతుంది.

రూ.211 నుంచి రూ.300 వరకు వేతనం పెంపు

పథకం పనికి వచ్చే ప్రతి వేతనదారుడికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్లలో ఇందు కోసం ఏటా గరిష్టంగా చెల్లిస్తున్న రోజువారీ కూలీని పెంచుతూ వస్తోంది. 2019–20 ఏడాదిలో రోజువారీ కూలీ రూ.211 ఉండగా, 2020–21లో దానిని రూ.237, 2021–22లో రూ.245, 2022–23లో రూ.257, 2023–24లో రూ.272, 2024 –25లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రూ.300 పెంపుదల చేసింది. దీంతో కూలీలు పథకం పనులకు ఎంతో ఉత్సాహంగా వెళ్తున్నారు.

ఏడాదికి కుటుంబానికి రూ.25 నుంచి రూ.27వేల వరకు లబ్ధి

పల్నాడు జిల్లాలో 3.15 లక్షల జాబ్‌కార్డులు ఉండగా వీటిలో 2.46 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వాటి పరిధిలో 5.42 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో 4.20 లక్షల మంది నిత్యం గ్రామాల్లో ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఒక్కో వేతనదారుడి కుటుంబానికి ఏడాదికి సగటున రూ.13,500 లబ్ధి జరుగుతుండగా, వారిలో 100 రోజులు పని పూర్తి చేసుకున్న వారి కుటుంబాలకు రూ.25 నుంచి రూ.27 వేల వరకు పథకం ద్వారా ఆదాయం లభించడం విశేషం.

జగన్ సర్కార్ ఐదేళ్ల కాలంలో...

పల్నాడు జిల్లాలో ఏడాదికి సుమారు 85 లక్షల చొప్పున ఈ పథకం ద్వారా 3.56 కోట్ల పనిదినాలు వేతనదారులకు కల్పించారు. వీటిలో 20,280 కుటుంబాలు 100 పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. ఆయా పనులు నిర్వహించిన కూలీలకు ఏటా రూ.204.02 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.759.23 కోట్ల డబ్బుల్ని వారి ఖాతాలకు జమ చేయడం జరిగింది. ఇవిగాకుండా మెటీరియల్ పనులకు రూ,603.33 కోట్ల నిధుల్ని వెచ్చించారు.

సత్వరమే చెల్లింపులు



ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ప్రభుత్వం ఏటా కూలీలకు లక్షల పనిదినాలు కల్పించి, వారి ఖాతాలకు రూ.కోట్లలో వేతనం జమచేస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వేతనాల చెల్లింపులు సత్వరమే చేస్తున్నాం. స్థానికంగానే పనులు దొరకడంతో వలసల సంఖ్య తగ్గింది.

–జె జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ, పల్నాడు జిల్లా

డ్వాక్రా కిస్తీలు, బిడ్డల చదువులకు ఉపయోగం



దూరాభారం ఎక్కడికి వెళ్లి పనులు వెతుక్కునే అవసరం లేకుండా సొంతూరిలోనే నీడపట్టున ఉపాధి హామీ పథకం పనులు చేసుకుంటున్నాం. సమయానికి డ్వాక్రా కిస్తీలు కడుతున్నాం. బిడ్డల్ని బాగా చదివించగలుగుతున్నాం.

–నేలం రత్నకుమారి, ఉపాధి కూలీ, జగ్గాపురం

కాలేజ్‌కు వెళ్తూనే పనులు చేసుకుంటున్నా..



అమ్మానాన్నతో కలిసి ఉదయం పూట ఊళ్లోనే పనులు చేసి తర్వాత కాలేజ్‌కు వెళ్తున్నా. విద్యకు సంబంధించిన ఖర్చుల కోసం అమ్మానాన్నను ఇబ్బంది పెట్టకుండా పోయింది. ఏడాదిగా రూ.25 నుంచి రూ.27 వేల వరకు ఆదాయం లభిస్తుంది.

–కె సురేష్, ఉపాధికూలీ, యడ్లపాడు

కేంద్రాల్లో ఓటు వేయలేని వారికే పోస్టల్ బ్యాలెట్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఎన్నికల విధుల్లో పాల్గొంటూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు అవకాశంలేని వారికి పోస్టల్ బ్యాలెట్(పీబీ) వేసే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, డ్రైవర్లు, పోలింగ్ విధులకు నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, బీఎల్‌వోలు, రిటైర్డు పోలీసు అధికారులు, ఆర్టీసీ, మెడికల్ సిబ్బంది, ఫైర్, ఫారెస్టు యూనిఫాం సర్వీసుల వారికి పీబీ ఇస్తారన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ వివరాలు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్‌పై ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది ఎన్నికల పోలింగ్‌లో పాల్గొంటే ఫారం 12 ద్వారా బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌కు అందజేయాలన్నారు. జిల్లాలో మే 5, 6, 7తేదీల్లో పీబీ తేదీలుగా నిర్ణయించామన్నారు. మే ఐదున ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు ఓటు వేస్తారన్నారు. 6న పోలీసు విభాగం, 7న ఎసెన్షియల్ సర్వీసు విభాగాల వారు పోస్టల్ ఓటు వేయాలన్నారు. ఆయా ఖచ్చితమైన తేదీల్లో కుదరని వారు ఎప్పుడైనా ఓటు వేయవచ్చ న్నారు. పీబీ ఆయా నియోజకవర్గాల్లో వేయా లని సూచించారు. పల్నాడు జిల్లాలో ఉంటూ వేరే జిల్లాల్లో ఎన్నికల విధుల్లో పనిచేసేవారికి ఈనెల 26వ తేదీలోపు ఫారం–12 ఆర్వో, డీఈవో కార్యాలయాల్లో అందజేయాలన్నారు. వెలగపూడి సెక్రటేరియేట్‌లో ఈనెల 28, మే 3, 10వ తేదీల్లో ఎక్స్ఛేంజ్‌లు ఏర్పాటు చేశారన్నారు. సేకరించిన ఫారం–12లను జిల్లాలు, నియోజకవర్గాల వారీగా 28న నిర్వహించే ఎక్స్ఛేంజ్‌కు పంపిస్తారని, మే 3న రిటర్నింగ్ అధికారులు వెళ్లి సిబ్బందికి పంపించిన బ్యాలెట్‌లు స్వీకరిస్తారన్నారు. వాటిని ఇక్కడ ఉద్యోగులకు అందజేస్తారన్నారు. వాటిని మే 5, 6, 7 తేదీల్లో ఏర్పాటుచేసే పోలింగ్‌లో వేస్తారన్నారు. జిల్లా వారీగా వచ్చిన వాటిని సేకరించి మే 10న సెక్రటేరియట్‌లో అందజేస్తారన్నారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో ఉన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే
జగనన్నే మళ్లీ సీఎం కావాలి

- కూటమి మూకుమ్మడిగా అడ్డుకున్నా గెలుపు అంబటిదే
- నేతలందరూ కలిసికట్టుగా నిలబడటం అభినందనీయం
- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, పక్కన మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టాలంటే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంత్రి అంబటి రాంబాబుతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కూటమి మూకుమ్మడిగా అడ్డుకున్నా, ఎన్ని కుట్రలు పన్నినా, సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ జెండానే ఎగిరేదని, అంబటి రాంబాబు అన్నదే గెలుపని స్పష్టం చేశారు. నియోజవర్గంలోని ముఖ్య నేతలు కలిసికట్టుగా ఒకే తాటిపైకి వచ్చి అంబటి రాంబాబు గెలుపు కోసం పనిచేయటానికి సిద్ధపడటం స్ఫూర్తిదాయకం అన్నారు. నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈనెల 24వ తేదీన నరసరావుపేటలో తాను నామినేషన్ వేస్తున్నానని, ఈ కార్యక్రమానికి మీరు అందరూ భారీ సంఖ్యలో హాజరై తనను ఆశీర్వదించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ సమావేశం ద్వారా గ్లోబల్ ప్రచారానికి ముగింపు పలుకుతూ ఐక్యంగా ఉన్నామనే సంకేతాన్ని శ్రేణులకు ఇస్తున్నామన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి అందరూ పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఈనెల 24వ తేదీన నరసరావుపేటలో పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, 25న సత్తెనపల్లిలో తాను నామినేషన్ దాఖలు చేస్తున్నామని, ప్రజలంతా భారీస్థాయిలో తరలివచ్చి తమను ఆశీర్వదించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ అంబటి రాంబాబుని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. పర్యావరణ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, పల్నాడు జిల్లా వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అంబటి రాంబాబు గెలుపు కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో గుంటూరు మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనా రాయణ, నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, బాసు లింగారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి పలువురు నాయకులు, ఉన్నారు.

ఉసురు తీసిన ఈత సరదా

- సాగర్ కాల్వలోకి దిగి ఎనిమిదో తరగతి విద్యార్థుల దుర్మరణం
- తూబాడులో తీవ్ర విషాదం



షేక్ అక్తర్ మృతదేహం



షేక్ సిద్దిక్ మృతదేహం

నాదెండ్ల: ఈత సరదా ఇరువురు చిన్నారుల ప్రాణాలను బలిగొంది. ఈ విషాద సంఘటన నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. తూబాడు నుంచి చిరుమామిళ్ల వెళ్లే మార్గమధ్యలో చిరుమామిళ్ల మేజర్ కాలువలో తాగునీటి చెరువులు నింపుకునేందుకు సాగర్‌జలాలు విడుదలయ్యాయి. ఆదివారం కావటంతో గ్రామానికి చెందిన ఇరవై మంది స్నేహితులు సరదాగా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఈతకు వెళ్లారు. 4.30 గంటల వరకూ అందరూ సరదాగా కాలువలో గడిపారు. 4.30 గంటల సమయంలో ఇరువురు చిన్నారులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. తోటి స్నేహితులు గమనించి సమీపంలోని పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులకు సమాచారమివ్వటంతో, హుటాహుటిన వారు కాలువలోకి దిగి చిన్నారుల కోసం వెతుకులాట ప్రారంభించారు. సుమారు 20 నిమిషాల వ్యవధిలో షేక్ అబుబకర్ సిద్దిక్ (13), షేక్ అక్తర్ (13) ఇరువురినీ బయటకు తీశారు. కొనఊపిరితో ఉన్న ఇరువురిని 108 వాహనాల్లో చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతులు పేదకుటుంబాల పిల్లలు

షేక్ అబుబకర్ సిద్దిక్ స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. చిన్నారి తండ్రి బాజి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు పదోతరగతి పూర్తి చేయగా, మృతుడు సిద్దిక్ రెండో కుమారుడు. షేక్ అక్తర్ జిల్లాపరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మౌలాలి తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మౌలాలికి ఇరువురు కవల పిల్లలు కాగా, ఒక కుమారుడు పుట్టిన రెండేళ్ల వయస్సులోనే మృతి చెందగా, ఉన్న ఏకై క కుమారుడైన అక్తర్ ఆదివారం నీటమునిగి మృతి చెందటంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. అప్పటి వరకూ సరదాగా ఆటపాటల్లో మునిగిన తమ బిడ్డలు ఇక లేరన్న విషాదాన్ని ఆ కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి సిబ్బందితో తూబాడు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఎన్నికలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్
- పలు చెక్‌పోస్టులలో తనిఖీలు
- గిరిజనులతో మాటామంతి



మరసపెంట రహదారి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

వెల్దుర్తి: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నిర్భయంగా వారికి నచ్చిన పార్టీకే ఓటు వేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఆ ఓటు హక్కును నిర్భయంగా వేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని శిరిగిరిపాడు చెక్, కుంకుడు చెట్టు పెంట తండా, గొట్టిపాళ్ల, మరసపెంట వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులను పరిశీలించి జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్‌తో మాట్లాడారు. మండలంలో సమస్యాత్మకమైన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. 121, 122 పోలింగ్ బూత్‌లలో వసతి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు పకడ్బందీగా, పటిష్టంగా, సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిందిగా రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్‌కు సూచించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించామన్నారు. ఆత్మ ప్రబోధానుసారం ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ముందుగా శిరిగిరిపాడు చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలను పకడ్బందీగా చేయాలని, అలసత్వం వహించవద్దన్నారు. నిరంతరం నిఘా అవసరమని సిబ్బందికి పలు సూచనలు, సలహాలందించామన్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులపై సరైన నిఘా వహించాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతమైన కుంకుడు చెట్టు తండాలో పర్యటించటం జరిగిందన్నారు. తండావాసులతో కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించామన్నారు. ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. మరసపెంట చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతూ నిఘాను పటిష్టంగా నిర్వహించాలని, ఎన్నికల విధులను జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ నరసింహ, వీఆర్వో యలమంద, చెక్‌పోస్టు అధికారి లక్ష్మారెడ్డి, ఎస్ఐ వి శ్రీహరి, వివిధ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి డీఎడ్ సెమిస్టర్ పరీక్షలు

యడ్లపాడు: డీఎడ్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని బోయపాలెం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం. సుభాని తెలిపారు. ఆదివారం పరీక్షల వివరాలను తెలియజేశారు. కళాశాలలో 2022–24 విద్యా సంవత్సరంలో అభ్యసించే విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు మొదలవుతాయని పేర్కొన్నారు. 22న పెడగాగి ఆఫ్ ఇంగ్లిష్ ప్రైమరీ లెవల్–1, 23న పెడగాగి ఆఫ్ ఈవీఎస్ ఎట్ ప్రైమరీ లెవల్–1, 24న పెడగాగి ఆఫ్ ఎలిమెంటరీ లెవెల్ ఆప్షనల్ సబ్జెక్టు, 25న కాన్‌టెంప్రరరీ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా –1, 26న ఇంటిగ్రేటింగ్ జండర్ అండ్ ఇన్‌క్లూజివ్ ఫర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, 27న స్కూల్ కల్చర్ లీడర్‌షిప్ అండ్ టీచర్ డెవలప్‌మెంట్ పరీక్షలు ఉంటాయని వివరించారు. 2023–25 విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు అదేరోజు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. 22న పెడగాగి ఆఫ్ మదర్‌టంగ్ (తెలుగు/ఉర్దూ/తమిళం), 23న పెడగాగి ఆఫ్ మాథ్స్ ఎట్ ప్రైమరీ లెవల్ –1, 24న పెడగాగి ఎక్రాస్ కరిక్యూలం అండ్ ఐసీటీ ఇంటిగ్రేషన్, 25న చైల్డ్‌హుడ్, చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ అండ్ లెర్నింగ్, 26న సొసైటీ, ఎడ్యుకేషన్ అండ్ కరిక్యూలమ్, 27న ఎర్లీ చైల్డ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. థర్డ్ సెమిస్టర్ విద్యార్థులు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. గతంలో సబ్జెక్టులు మిగిలిన పోయిన వారు కూడా ఇదే పరీక్ష సమయంలో ఆయా బ్యాచ్‌లతో హాజరై పరీక్షలు రాయవచ్చని ఆయన సూచించారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

క్రోసూరు: స్థానిలో ఏపీ మోడల్ స్కూలులో ఆదివారం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్స్‌పాల్ ఎం.మేరీ సుజన్ తెలిపారు. మొత్తం 258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 237 మంది హాజరైనట్లు ఆమె చెప్పారు. వీరిలో ఉత్తీర్ణులైన 100 మందికి ఆర్డర్ ఆఫ్ మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయించబడతాయని ఆమె వివరించారు.



క్లుప్తంగా

మొబైల్ ఫోన్ పేలి బాలికకు తీవ్ర గాయాలు

చార్జింగ్ పెట్టి వీడియోలు చూస్తుండగా ఘటన



బెల్లంకొండ: చేతిలోని మొబైల్ ఫోన్ పేలి 11 ఏళ్ల బాలిక తీవ్రంగా గాయపడిన ఘటన పల్నాడు జిల్లా ఎమ్మాజీగూడెం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచాల వెంకటేశ్వరరావు కుమార్తె వీరలక్ష్మి శనివారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తర్వాత రోజు మాదిరిగానే ఇంట్లో ఉన్న తండ్రి స్మార్ట్ ఫోన్ తీసుకుని వీడియోలు చూస్తోంది. చార్జింగ్ అయిపోవడంతో చార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్ చూస్తుండగా అది ఒక్కసారిగా పెద్ద శబ్దంతో చేతిలో పేలిపోయింది. వీరలక్ష్మి కుడి చేయి, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. చేతి వేళ్లు రెండు పూర్తిగా తెగిపోయి, నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాలికను 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం గుంటూరు తరలించారు.

రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు జగదీశ్వరి ఎంపిక



చీరాల టౌన్: 23వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని చీరాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ వై.జగదీశ్వరి రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు ఎంపికైందని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు గ్రూపు పరిధిలో నిర్వహించిన రైఫిల్ ఫైరింగ్‌లో ఉత్తమ ప్రతిభచూపిన జగదీశ్వరి మే 3 నుంచి 13 వరకు జరిగే ఏపీ, తెలంగాణ ఫైరింగ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. నర్సరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న జగదీశ్వరి పోటీలకు ఎంపికవ్వడంపై సుబేదార్ మేజర్ ముఖేష్‌కుమార్, సుబేదార్ సత్యేంద్రసింగ్, హవల్దార్ మేజర్ రమేష్, ఎన్‌సీసీ ఆఫీసర్ రాజేష్‌లు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



అద్దంకి రూరల్: ఆగిఉన్న ఇటుక ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన అద్దంకి మండలంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. దర్శి నియోజక వర్గ టీడీపీ సమన్వయకర్త బ్రహ్మం చౌదరి కారులో దర్శి నుంచి గుంటూరు వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అద్దంకి మండలంలోని జార్లపాలెం గ్రామ సమీపంలో ఆగిఉన్న ఇటుక లోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టటంతో బ్రహ్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో హైవే అంబులెన్స్‌లో ఒంగోలు తరలించారు.

బీసీలకు వైఎస్సార్ సీపీతోనే న్యాయం

- 50 శాతం బీసీలకే టికెట్లు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- జంగా అన్న తన ఓటమిని కోరుకోవడం బాధాకరం
- గురజాల ఎన్నికల ప్రచారంలో నిలదీసిన ఎంపీ అభ్యర్థి అనిల్
- పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏసురత్నం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పక్కన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

గురజాల: తన చేయి పట్టుకుని గెలిపించాల్సిన వ్యక్తే తన ఓటమిని చవిచూడాలని టీడీపీతో చేతులు కలిపి ఊరూరా తిరగడం తనకు ఎంతో బాధగా ఉందని వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. గురజాల నగర పంచాయతీలోని 12, 13, 14 వార్డుల్లో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంతో కలిసి ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. మాడుగుల రోడ్డులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కూటమిని నమ్ముకుని ఎన్నికలకు వస్తున్నారని, సీఎం వైఎస్ జగన్ మాత్రం ప్రజలను నమ్ముకుని వచ్చారన్నారు. తెలుగుదేశం పార్టీకి ఎంపీ అభ్యర్థులు దొరక్క.. వైఎస్సార్ సీపీ నుంచి తీసుకువెళ్లి ఎంపీ సీటు ఇచ్చారని ఎద్దేవ చేశారు. అలాగే పార్టీ నుంచి జంగా అన్నను తీసుకు వెళ్లారని, మరి ఆయనకు ఎమ్మెల్యే సీటు ఎందుకు ఇవ్వలేదని చంద్రబాబుని ప్రశ్నించారు. 'మీకు ఒక న్యాయం. మాకు ఒక న్యాయమా' అని అనిల్ ప్రశ్నించారు. ప్రతి సభలో ఎక్కడి నుంచో నెల్లూరు నుంచి వచ్చానని.. మాట్లాడుతున్న టీడీపీ నాయకులను గల్లా జయదేవ్, మంగళగిరిని మందళగిరి అని మాట్లాడే లోకేష్ చిత్తూరు నుంచి రాలేదా అని ప్రశ్నించారు. ఒక్క బీసీకైనా ఎంపీ, ఎమ్మెల్యే సీటు ఇచ్చారా అని నిలదీశారు. బీసీలకు 50 శాతం టికెట్లు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి

ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

సంక్షేమ సారథికి పట్టం కట్టాలని గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. డ్వాక్రా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి వెనుదిరిగిన వ్యక్తి చంద్రబాబు అని, ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణమాఫీ చేసిన వ్యక్తి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వృద్ధులపై కక్ష్య గట్టి హైకోర్టులో పిటిషన్ వేసి వలంటీర్ ద్వారా పింఛను అందకుండా చేసిన నాయకుడు చంద్రబాబు కావాలా..మీ ఇంటికి వచ్చి ఉదయాన్నే పలకరించి సంక్షేమ పథకాలు ఇప్పించే జగన్‌మోహన్‌రెడ్డి కావాలా అని అడిగారు. అభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారన్నారు.

బీసీలకు అగ్రపీఠం సీఎం జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

బడుగు బలహీన వర్గాలకు అగ్రపీఠం వేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. టీడీపీ నాయకులు ఓట్ల కోసమే బీసీలకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఎంతోమంది బీసీలకు పదవులు ఇచ్చి అగ్రస్థానం కల్పించిన జగన్‌ను మనమంతా బలపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా కాశీబాబు, కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, దేవండ్ల నీలంరాజు, డికే, మహంకాళీ యశోద దుర్గా, బండి రవికుమార్, షేక్ పీర్ అహ్మద్, కర్రా గిరిబాబు, గోళ్లా సైదయ్య, తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

సాదరంగా ఆహ్వానించిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కావటి మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: యడ్లపాడు మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మల్లా కోటేశ్వరరావు నేతృత్వంలో యడ్లపాడు, బోయపాలెం గ్రామాలకు చెందిన జనసేన వీర మహిళలు, సైనికులు మల్లా భూలక్ష్మి, నల్లబోతుల కోటేశ్వరమ్మ, భూక్యా సుజాత, మండ్ల లావణ్య, మణెమ్మ, శివమ్మ, తిరుపతమ్మ, కల్పన, వీరమ్మ, కోటేశ్వరరావు, గోపీ, వాసు, సుబ్బులతో పాటు 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. చిలకలూరిపేట నియోజక వర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమం అనంతరం కావటి మనోహర్ నాయుడు మాట్లాడారు. నిజాయితీగా జనసేనకు పనిచేసినా గుర్తింపు లేకపోవడం, నాయకులను పట్టించుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురైన వారు వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి నచ్చి వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. యడవల్లి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వివిధ పార్టీలకు సంబంధించిన 25 కుటుంబాల ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కావటి మనోహర్ నాయుడి సోదరుడు విక్రమ్ నాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. టి.రవి, నరేంద్ర, వెంకయ్య, బాబు, బుజ్జి, పెదకోటయ్య, సుధీర్, ఎం.బెంజి, క్రాంతి, ఎ.రాజా, బి.వీరయ్య, వి.సుబ్బారావు, కె.రోశయ్య పార్టీలో చేరారు.

ముస్లిం మైనార్టీ నేతల చేరిక

పట్టణంలోని పదో వార్డుకు చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు మాబుజాని మేస్త్రి తన అనుచరులతో కలసి వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి సయ్యద్ జమీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీలో చేరారు.



ముస్లిం మైనార్టీ నాయకులను ఆహ్వానిస్తున్న కావటి

వైఎస్సార్ సీపీ అభ్యర్థి మనోహర్ నాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్, మంత్రి అంబటి



పార్టీలో చేరిన వారితో అనిల్‌కుమార్ యాదవ్, మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రానున్నది మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, జగన్‌మోహన్‌రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రిగా కావడం ఖాయమని వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో రాజుపాలెం మండలం పెద్ద నెమిలిపురి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు చిట్యాల కాసిం సైదా, బత్తుల నాగేశ్వరరావు, బత్తుల శ్రీనివాసరావు ఆ ఆపార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో లేని గుర్తింపును వైఎస్సార్ సీపీ అందిస్తుందని చేరిన నేతలకు హామీ ఇచ్చారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ స్థానిక నాయకులతో కలిసి సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, నియోజక వర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, నాయకులు పెండెం బాబురావు, చిట్టా విజయ భాస్కరరెడ్డి, రాజుపాలెం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, కందులూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీకి గట్టి ఎదురు దెబ్బ..

నకరికల్లు: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్న 20 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్ సీపీ చేరాయి. దీంతో టీడీపీకి ఈసారి గట్టి దెబ్బే తగిలినట్లైంది.ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో దేచవరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి, కార్యకర్తల్లో ఉత్తేజం నింపారు. ప్రచార రథంలో మంత్రి అంబటి రాంబాబు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని చర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ టీడీపీ అరాచకాలకు విసుగు చెందిన ఆ పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన కందుల పెదవేమారెడ్డి, కందుల లక్ష్మారెడ్డి, కందుల నాగార్జునరెడ్డి, దొడ్డా పేరిరెడ్డి, దాసరి బ్రహ్మం, దాసరి వెంకట్రావు, గురజాల కిట్టయ్య, కొండా నాగిరెడ్డి, దొడ్డా పెద్దిరెడ్డి, ఏరువ రామిరెడ్డి, పెద్దిరెడ్డి సైదారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



వైఎస్సార్ సీపీలో చేరిన దేచవరం నాయకులతో మంత్రి అంబటి రాంబాబు

వైఎస్సార్ సీపీలో కాపు కుటుంబాల చేరిక

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి



పార్టీలో చేరిన కాపు కుటుంబాలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గత ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని చూసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు టీడీపీ వర్గీయులు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆ పార్టీ నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని తొమ్మిదో వార్డు శ్రీనివాసనగర్‌లో కాపు సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాల వ్యక్తులు టీడీపీని వీడి డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ అని స్పష్టం చేశారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రానికి సీఎంగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు తన పాలనలో చెప్పుకునేందుకు ఏమీ లేక తన పార్టీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీ వర్గీయులపై ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. కూటమిగా ఎన్నికలకు వచ్చినా విజయం సాధించడం కష్టమనే ఆలోచనతో చంద్రబాబు దారుణంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వార్డు మాజీ కౌన్సిలర్, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఎస్‌ఏ హనీఫ్, నాయకులు కోటేశ్వరరావు, న్యాయవాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుల వ్యాపార వృద్ధికి సొసైటీ

ఇద్దరు చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం



నగదు చెక్కు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణుల అభ్యున్నతికి రాష్ట్రంలో తొలిసారిగా బ్రాహ్మణ అభివృద్ధి సొసైటీని ఏర్పాటు చేసినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఇద్దరు చిరు వ్యాపారులకు రూ.33 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా శివకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందేందుకు రాష్ట్రంలో తొలిసారిగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ ప్రతినిధి శ్రీగిరిరాజు నాగేశ్వరరావు తమ పథకానికి రూ.11 లక్షలు ఆర్థిక సాయం అందించారని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సొసైటీ కార్యాలయాలను ఏర్పాటు చేసి, కో ఆర్డినేటర్లను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు శ్రీగిరిరాజు నాగేశ్వరరావు, కోట సాంబశివరావు, కాశీనాథుని సుబ్రహ్మణ్యం, మేళ్లచెరువు సతీష్, కేవీ పురుషోత్తమరావు, హారిక పాల్గొన్నారు.

పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం

వినుకొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు



పార్టీలో చేరిన వారితో బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని 22, 23వ వార్డులకు చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింత సంక్షేమం అమలు చేస్తామని తెలిపారు.

పార్టీ మారి బలిపశువు అయిన జంగా

సమావేశంలో బీసీ సంఘాల నాయకులు



సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

నరసరావుపేట: గురజాల బీసీ నాయకుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరి బలిపశువు అయ్యారని పలు సంఘాల బీసీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ పార్లమెంటు అభ్యర్థి కార్యాలయంలో బీసీ సంఘీయులు సమావేశం నిర్వహించారు. శనివారం దుర్గి గ్రామంలో నిర్వహించిన టీడీపీ బీసీ సదస్సులో పాల్గొన్న జంగా.. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మతోన్మాద పార్టీతో కూడిన కూటమితో కలిసి జంగా బలిపశువు అయ్యారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలో ఉండగా పదిమందిలో ఒకడిగా ఉన్నారని, కూటమిలోకి వెళ్లి వందలో ఒకడిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీ సంఘీయులందరూ అనిల్‌కుమార్‌యాదవ్ విజయానికి కృషిచేస్తామని ముక్త కంఠంతో స్పష్టం చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామి, జిల్లా బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్, మహిళా అధ్యక్షురాలు టి.మంగమ్మ అంజియ్య, సీనియర్ బీసీ సంఘ నాయకులు బోయిన సుబ్బారావు, త్రికోటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి సభ్యుడు అట్లూరి బాలాసుబ్రహ్మణ్యం నాయీ, ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బీసీ వెల్ఫేర్ జేఏసీ కోశాధికారి రాంబాబు, నాయకులు గాదెల్లి సాంబశివరావు, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావాలి, రావూరి కోటేశ్వరరావు, షేక్ గాలిబ్, సీహెచ్ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రచార వాహనాల అడ్డగింత

- డ్రైవర్‌పై చేయి చేసుకున్న టీడీపీ నాయకులు
- కేసు నమోదు చేయాలంటూ వైస్సార్ సీపీ నాయకుల ఆందోళన



వైఎస్సార్ సీపీ శ్రేణులను అదుపు చేస్తున్న పోలీసులు

బెల్లంకొండ : ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో తిరుగుతున్న వైఎస్సార్ సీపీ ప్రచార వాహనాలను టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ఈ ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామంలో నరసరావుపేట టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి రుద్రమదేవి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అదే సమయంలో అటుగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ ప్రచార వాహనాలను టీడీపీ నాయకుల అడ్డుకొని డ్రైవర్‌పై చేయి చేసుకున్నారు. దీంతో అక్కడే ఉన్న యువకులు ప్రచార వాహనాలను ఎందుకు ఆపారంటూ ప్రశ్నించారు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎంపీపీ పద్మ వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ బద్దూరి చంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా మోహరించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని వారిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రచార వాహనాలు అడ్డుకొని, డ్రైవర్‌పై చేయి చేసుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. అప్పటి వరకు అక్కడ నుంచి కదిలేది లేదని బైఠాయించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రాజేష్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ నేతల దాడి

ఒకరికి తీవ్రంగా.. ఇద్దరికి స్వల్ప గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న పేరుపోగు విజయ్ సామేలు, సుశీల

మాచర్ల రూరల్: 'మా పల్లెలో వైఎస్సార్ సీపీ జెండా కట్టి మాకెదురుగా ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అడిగేంత దమ్ము, ధైర్యం మీకెక్కడి నుంచి వచ్చిందిరా.' అంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడి చేసి, గాయపర్చిన ఘటన ఆదివారం మండలంలోని రాయవరం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ పల్లెలో పేరుపోగు విజయ్‌కుమార్, పాన్నాల సామేలు, పేరుపోగు సుశీల తదితరులు సోమవారం పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్ వేయనున్నారని కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అక్కడే ఉన్న టీడీపీకి చెందిన పెనుపాటి అంజి, పెనుపాటి ఏసోబు మాష్టారు, రమేష్, ఉదయ్ కుమార్, మేరిబాబు, దాసు, చిన ఏసోబు ఒక్కసారిగా వారిపై దాడి చేశారు. వైఎస్సార్ సీపీ తరపున ప్రచారం చేసినా, జెండా పట్టుకున్నా కాళ్లు విరగ్గొడతామంటూ కర్రలతో కొట్టడంతో విజయ్ కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పాన్నాల సామేలు, పేరుపోగు సుశీలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి, విజయ్‌కుమార్‌ను నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.